# అమరావతి కథలు

సత్యం శంకరమంచి



## సీతారామాభ్యాం నమః

శాస్త్రిగారు దర్భక్రరలా పచ్చగా, పొడ వుగా ఉంటారు. ఆయన అసలు పేరే విటో తెలియదు. అందరూ రామాయణం శాస్త్రిగారంటారు.

కల్యాణ మంటపంలో రాత్రి ఎనిమిది గంటల వేళ చుట్టూ చిమ్మ చీకటి. మంట పంలో ఆముదం దీపం అఖండంగా వెలుగు తూంటే పక్కన వ్యాస పీటమీద రామా యణం ఉంచుకుని వ్యాఖ్యానం చేస్తు న్నారు శాస్త్రిగారు. దాన్ని వ్యాఖ్యానం అనటానికి లేదు. గంట మోగినట్టుండే ఆ కంఠంలోంచి ప్రవాహంలా రామకథ సాగు తుంది. భగీరథుడి వెనకాల గంగ పరుగెత్తి నట్లు జలపాతంలా దూకుతోంది. ఆ కథ నంలో ఎన్ని మళ్ళు, ఎన్ని మలుపులు, ఎంత నిదానం, ఎంత ఆర్ద్రత. చెట్లు చెవులు రిక్కించి వింటున్నట్టుండి. గాలంతా రామ మయం అయిపోతుంది. వింటున్న వాళ్ళు బొమ్మలై పోతారు. పిల్లలు సైతం ఉల కరు పలకరు. మనసున రామచింతన తప్ప, మరో ధ్యానలేదు.

శాస్త్రిగారు తన్మయులై చెప్పుకుపోతు న్నారు. ఆ నాడు రామ పట్టాభిషేకం నిశ్చ యమైననాడు సీతమ్మ తన స్వామి రాక కోసం ఎదురు చూస్తోంది. స్వామి రానే వచ్చాడు. ఎలా వచ్చాడు? పట్టాభిషేక లాంఛనాలతో, చక్రవర్తి అలంకారాలతో రాలేదు. నారచీరలు కట్టుకుని అటవికుడులా వచ్చాడు. సీతమ్మ విస్తుపోయింది. మరీ విస్తుపోనివ్వకుండా రామయ్య అన్నాడు "తండ్రి ఆన ప్రకారం పద్నాలు గేళ్ళు అరణ్యవాసం వెడుతున్నాను" అని. సీతమ్మ అరక్షణం ఆగి లోపలి కెళ్ళిపోయింది. దుఃఖం పట్టలేక పోయిం దేమో అనుకున్నాడు రామయ్య. మరి కొంచెం సేపట్లో సీతమ్మ నారచీరలు కట్టు కొచ్చి "నేనూ అరణ్యాలకు తమ ననుస రిస్తా"నంది. ఇప్పుడు విస్తుపోవటం రామయ్యవంతు. "జనక మహారాజు బిడ్డవు. ఎండ కన్నెరుగని దానవు. రావద్దు" అన్నాడు. స్వామీ! నీవులేని ఈ భవనం నాకు శూన్యంకదా! నీవు పక్కనలేక అమృతమూ అరుచియేకదా! నీ సాన్నిధ్యం నాకు స్వర్గం. నన్ను వారించకండి. అంటూ భర్త ననుసరించి పువ్వుల మీద నడిస్తే కసుగందే సీతమ్మ పాదాలు ముళ్ళ బాటల్లో, రక్కసి పొదల్లో నడుస్తుంటే పాదాలు చీరుకుపోయి, నెత్తురు చిప్పిలు తున్నా, భర్త సన్నిధే తనకు ప్రాణమని చిరునవ్వు నవ్వెందేకాని కంటనీరెట్ట లేదయ్యా....

జనంలో ఉన్న రుక్మిణి కన్నీరు మున్నీరై పోయింది. రుక్మిణి అత్తగారి మీద కోపంవచ్చి అత్తిల్లు వదలి పుట్టింటికి వచ్చి ఆర్నెల్లయింది. ఉన్నట్టుండి రుక్మి ణికి భర్తమీద పోయింది మనసు. అన్నం సరిగ్గా తింటున్నాడో లేదో! అన్నం అయ్యాక ఆకు, పక్క తనే వేసుకుంటు న్నాడుకాబోలు. అర్ధరాత్రి మెలకువ వచ్చి నప్పుడు తాగటానికి మంచం కింద మంచి నీళ్ళు పెడుతున్నారో మర్చిపోతున్నారో! స్నానమాడుతున్నప్పుడు వీపెవ్వరూ రుద్దరు కాబోలు. ఇష్టమైనకొత్తిమెర కారం నూరిపెట్టరు కాబోలు! దుఃఖం పొంగుకు రాగా కొంగుతో ముఖం కప్పుకుంది.

ఉదయాన్నే శాస్త్రిగారు ఇంటింటి ముందుకు వచ్చి "సీతారామాభ్యాం నమః" అంటారు. ఇంటివారు గుప్పెడు బియ్యం యాయవారం చెంబులో పోస్తే, ఆరోజు తిథి, వారం, వర్జం చెప్తారు. అలా చెప్ప కుంటూ పెద్దబజార్లో కొస్తే అక్కడ రైతులు కొత్తనాగలి పట్టడానికి ముహూ ర్తాలు, పిల్లకి చెవులు కుట్టడానికి మంచి రోజు అడుగుతారు. పంచాంగం తీసి వాళ్ళకి మంచిరోజులు చెప్పి రుక్మిణి ఇంటి ముందుకొచ్చి "సీతా రామాభ్యాంనమః" అన్నారు. రుక్మిణి వరుగెత్తుకొచ్చి "అయ్యా! తూర్పు ప్రయాణానికి మంచి రోజెప్పుడు?" అనడిగింది.

శాస్త్రిగారు ఆలోచనగా రుక్మిణివైపు చూసి పంచాంగం విప్పకుండానే "తూర్పున సూర్యుడుంటాడు. సూర్యుడు నీ దేవుడు. నీ దేవుడి దగ్గర కెళ్ళటానికి సంకల్పమే ముహూర్తం. భోజనంచేసి వెంటనే బయలు దేరు" అన్నాడు. రుక్మిణి ముఖమింత చేసుకుని అర సోలెడు బియ్యం చెంబులో పోసింది.

ఆ రోజు ఋష్యమూక పర్వతం మీద శ్రీరామచంద్రుడికి దొరికిన నగలు చూపి స్తున్న ఘట్టం. నగల మూట విప్పాడు రామయ్య. కన్నీటి పొరలు కమ్ముకుంటు న్నాయి. ఏవీ కన్పించటంలేదు. అవి ఏం నగలో సీతమ్మవవునో కాదో చెప్పలేక పోతున్నాడు. పక్కనున్న లక్ష్మణుణ్ణి పిలిచి "తమ్ముడూ! నాకేం కన్పించటం లేదు. ఇవి నీ వొదినగారి నగలవునో కాదో చెప్పవయ్యా" అన్నాడు. లక్ష్మణుడు ఆ నగలు పరిశీలించి. "ఈ కర్ణపత్రాలు నాసి కాభరణాలు. ఇవి ఎవరివో నాకు తెలియదు. కాని ఈ పాద మంజీరాలు మాత్రం మాతృ సమానురాలైన నా వొదినగారివే" అన్నాడు. అంటే ఆ లక్ష్మణస్వామి ప్రతి రోజూ సీతమ్మ పాదాలకు వందనం చేసు కునేవాడు. ఆమె కాలి పట్టీలుతప్ప ఆ వద యుగ్మం తప్ప మరింకేవీ తెలియని మహా భక్తుడయ్య ఆయన."

ఇది విన్న రుద్రయ్య కళవళ పడిపో తున్నాడు. వొదినగారిమీద కోపంతో అన్నతో వేరుపడి వచ్చిన రుద్రయ్య, మర్నాడే క్షమాపణ చెప్పుకుని అన్నతో కలిసి పోయాడని వేరే చెప్పక్కర్లేదు.

పదేళ్ళు గడిచాయి. కళ్యాణమండ పంలో ఆముదం దీపం వక్కనుంచి రామాయణం విన్పించటంలేదు. ఇప్పుడు చూస్తే పదిమంది పెట్రోమాక్సు లైటు పెట్టుకుని పేకాడుకుంటారు. వెనక రామ మయంగా వుండే గాలిలో "నీయమ్మ జోకరు"లాంటి బూతులు తేలుతున్నాయి.

ఇప్పుడే రామాయణం విడివడిన కుటుం బాలను కలుపుతోందో, సత్యాన్ని నిలబెడు తోందో! ★